సాక్షి ఒడిశా

ఆదివారం । 16 । జూన్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.6,51,901
బంగారం	2 గ్రాముల 250 మిల్లీ గ్రాములు
వెండి	32 గ్రాముల 550 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



ప్రాణం తీసిన సెల్ఫీ సరదా

మల్కన్‌గిరి జిల్లాలోని ఖోయిర్‌పూట్ సమితి మడ్కపొదర్ గుమ్మ జలపాతంలో సెల్ఫీ తీసుకుంటూ జారిపడి అన్నదమ్ములు మృతి చెందారు.

- 8లో



వైభవంగా రొజ్జొ

ఒడిశా ప్రజలకు అతి ప్రియమైన రొజ్జొ వేడుకలు రెండో రోజు శనివారం వైభవంగా జరుపుకున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

మంటల్లో కారు దగ్ధం



మంటల్లో కాలిపోయిన కారు

జయపురం: సమితి పరిధి భరిణిపుట్ పంచాయతీ గేట్‌గుడ గ్రామంలోని ఒక షోరూం వద్ద పార్క్ చేయబడిన కారులో శుక్రవారం రాత్రి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో కారు కాలి బూడిదైంది. షార్ట్ సర్క్యూట్ వలనే ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు అనుమానిస్తున్నారు. ముందుగా బోనెట్ నుంచి మంటలు లేచాయని, అది చూసిన స్థానికులు వెంటనే అగ్ని మాపక విభాగానికి తెలియజేశారు. అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను ఆర్పింది. సమాచారం అందుకున్న భరిణిపుట్ పోలీసు పంటి అధికారి కామాక్ష ప్రసాద్ బిశాయి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు జరిపారు. కారు కాలిపోవడంలో ఎవరి హస్తం ఉండి ఉండదని అభిప్రాయపడ్డారు.

ఫేక్ న్యూస్‌పై అప్రమత్తంగా ఉండాలి



సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటో

భువనేశ్వర్: సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ న్యూస్‌పై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం నుంచి ప్రభుత్వం రాష్ట్రంలో సారా నిషేధం అమలుకు ఉత్తర్వులు జారీ చేసిందనేది వైరల్ అయ్యింది. దీంతో వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి ప్రకటన జారీ చేయనట్లు శనివారం అధికారిక వర్గాలు స్పష్టం చేశాయి. దయచేసి తప్పుడు వదంతులు ప్రచారం చేయడం మానుకోవాలని సూచించాయి. ఫేక్ న్యూస్‌పై చర్యలు తప్పవని హెచ్చరించాయి.

పిడుగు పడి బాలిక దుర్మరణం



బాలిక మృతదేహం

జయపురం: కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి రాళ్లగెడ్డ గ్రామ పంచాయతీ బుందేల్‌పడ గ్రామంలో శుక్రవారం సాయంత్రం పిడుగు పడి ఒక బాలిక దుర్మరణం చెందింది. మృతి చెందిన బాలిక పేరు మారీ తమాల్. ఆ బాలిక శుక్రవారం మధ్యాహ్నం బుందేల్‌పడ గ్రామ సమీపంలోకి పశువులను మేపేందుకు తీసుకెళ్లింది. ఆ సమయంలో ఉరుములు మెరుపులు, పిడుగుతో పెద్ద వర్షం కురిసింది. అదే సమయంలో ఆ బాలికపై పిడుగు పడడంతో కింద పడిపోయింది. అది చూసిన గ్రామస్తులు వెంటనే ఆమెను పొట్టంగి కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే మార్గమధ్యలోనే మరణించింది. ఈ సంఘటనపై మృతురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.


సారా బట్టీలపై దాడులు



స్వాధీనం చేసుకున్న సామగ్రితో ఎక్సైజ్ సిబ్బంది

జయపురం: సమితిలోని పాత్రోపుట్ సమీప అడవిలో నాటుసారా తయారు చేస్తున్న బట్టీలపై జయపురం ఎక్సైజ్ సిబ్బంది దాడులు జరిపినట్లు జయపురం ఎక్సైజ్ స్టేషన్ అధికారి నీలాద్రి బిహారి మిశ్ర వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం పాత్రోపుట్ అడవిలో నడుపుతున్న నాలుగు సారాబట్టీలపై దాడులు జరిపినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో 60 లీటర్ల నాటుసారాతో పాటు 1000 లీటర్లకు పైగా సారా తయారీ చేసేందుకు సిద్ధంగా ఉంచిన ఇప్ప ఊటను ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. అధికారులను గమనించి బట్టీల్లో సారా వండుతున్న వ్యక్తులు పారిపోయారన్నారు.

కరుణించమ్మా... బురదల పోలమ్మ..!



పూజలందుకుంటున్న బురదల పోలమ్మ



అమ్మవారి మందిరం

- రేపటి నుండి అమ్మవారి ఉత్సవాలు
- ముస్తాబైన మందిరం
- మశూచి నివారణకు గుర్తుగా పూజలు

రాయగడ: స్థానిక భైరవీధిలో వెలసి పూజలందుకుంటున్న బురదల పోలమ్మ అమ్మవారి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయి. తొమ్మిది రోజుల పాటుగా జరిగే ఈ ఉత్సవాలు ఈనెల 26తో ముగుస్తాయి. అమ్మవారి ఉత్సవాల సందర్భంగా ఉత్సవ కమిటీ ఇప్పటికే ఏర్పాట్లను పూర్తి చేసింది. అమ్మవారి ప్రతిరూపాలుగా కొలిచే ఘటాలను నిలిపేందుకు మెయిన్ రోడ్డు కూడలిలో తాత్కాలిక షెడ్డును ఏర్పాటు చేశారు. ఈ షెడ్డులో తొమ్మిది రోజులు ఘటాలను పూజిస్తారు. ఉత్సవాల్లో భాగంగా మందిరానికి ముస్తాబు చేశారు. విద్యుత్ అలంకరణలతో మందిరం ధగధగ మెరిసిపోతోంది. అదేవిధంగా స్థానిక జగన్నాథ రథం నిలిపే కూడలి నుంచి స్టేట్‌బ్యాంక్ కూడలి వరకు విద్యుత్ అలంకరణలు చేపట్టారు. ప్రతీ ఏడాదిలా ఈసారి కూడా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కమిటీ నిర్ణయించింది. అందుకు ఉత్సవ కమిటీ ప్రత్యేకంగా ఏర్పాటయ్యింది. కమిటీ అధ్యక్షులుగా పతివాడ శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షులుగా ఎద్దు శ్రీహరి, కోశాధికారిగా బొచ్చా సర్వేశ్వరరావు, సాధారణ కార్యదర్శిగా బార్జి శేషగిరి తదితరులు ఉన్నారు.

ముందుగా చాటింపు

అమ్మవారి ఉత్సవాలకు రెండు రోజుల ముందుగా ఊరు బారికితో చాటింపు వేస్తారు. ఆదివాసీ సాంప్రదాయ డప్పు వాయిద్యంతో ఊరి బారికి గ్రామంలోని ప్రతివీధిలో ఈ చాటింపు వేస్తారు. ఈ చాటింపుతో అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమైనట్లు భావిస్తారు. అయితే ఈ చాటింపు విన్న ప్రతి ఒక్కరూ ఊరి దాటి వెళ్లకూడదన్నది అనాదిగా వస్తున్న సాంప్రదాయం. ఒకవేళ అవసరం మేరకు ఊరి బయటకు వెళ్తే తిరిగి అమ్మవారి ఉత్సవాలు ముగింపు సమయం నాటికి ఊరిలో ఉండాలన్నది నియమం. లేదంటే వారికి అరిష్టం దాపురిస్తుందని ఒక గట్టి నమ్మకం. అదే ఆచారాన్ని ఇప్పటికీ గ్రామస్తులు పాటిస్తుండడం విశేషం.



ఉజ్జిడి బండి (ఫైల్)

ఉజ్జిడి బండి ఊరేగింపు

అమ్మవారి ఉత్సవాలకు ఒకరోజు ముందుగా ఉజ్జిడి బండి ఉత్సవం ఉంటుంది. ఆదివారం తెల్లవారుజామున ప్రత్యేకంగా వెదురుతో రూపొందించిన చక్రాల బండిపై వెదురుతో అల్లిన బుట్టను ఉంచి లాగుతారు. ఈ బుట్టలో గ్రామ ప్రజలు చద్దన్నం వేస్తారు. సమకూరిన చద్దన్నాన్ని అంతా తీసుకెళ్లి స్థానిక రాణిగుడ ఫారంలోని ఒక పెంటకుప్పపై జల్లుతారు. అప్పట్లో రాణిగుడఫారం ప్రాంతం రాయగడ రాజువారి ఏనుగుల శాలగా పిలవడంతో పాటు రాణి నివాసంగా ఉండేదని, అందుకే దీనిని రాణిగుడ ఫారంగా పేరొచ్చిందని పెద్దలు చెబుతుంటారు. ఊరి ప్రజలు ఉజ్జిడి బండిలో వేసిన చద్దన్నంను ఇక్కడ వేయడంతో వాటిని ఏనుగులు తింటాయన్నది స్థల చరిత్రగా ఉంది.



దువ్వెర పోతన్న మందిరం

ఉత్సవాల్లో ఘటాలు

మశూచి బారినుంచి గ్రామస్తులను కాపాడినందుకు గ్రామస్తులు బురదల పోలమ్మ ఉత్సవాలను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మహమ్మారిని పారదోలేందుకు సహకరించిన అమ్మవారి అక్కాచెల్లెల్లను కూడా పూజిస్తారు. అందువలన వారి ప్రతి రూపాలుగా కొలిచే ఘటాలను ఈ తొమ్మిది రోజులు పూజిస్తారు. ఈ ఉత్సవాల తొమ్మిది రోజులు అమ్మవారితో పాటు తొమ్మది ఘటాలను ఏర్పాటు చేస్తారు.

రూ.10 లక్షల వ్యయంతో ఉత్సవాలు



ఈ ఏడాది అమ్మవారి ఉత్సవాలను సుమారు రూ.10 లక్షల వ్యయంతో నిర్వహిస్తున్నాం. దీనిలో భాగంగా సుమారు రూ.1.25 లక్షలు అమ్మవారి మందిరానికి పెయింటింగ్స్ కోసం ఖర్చు చేయడం జరిగింది. తొమ్మిది రోజుల పాటు జరిగే పూజల కోసం మందిరాన్ని ముస్తాబు చేశాం. పట్టణ ప్రజల ఆర్థిక సాయంతో ప్రతి ఏడాది ఘనంగా నిర్వహిస్తున్నాం.

– పతివాడ శ్రీనివాస్‌రావు, కమిటీ అధ్యక్షుడు

సంప్రదాయ పద్ధతిలో పూజలు



అనాదిగా వస్తున్న సాంప్రదాయాలకు అనుగుణంగా ఉత్సవాల్లో పూజా విధానాలు కొనసాగిస్తున్నాం. అమ్మవారికి ప్రీతికరమైన ఆదివాసీ డప్పు వాయిద్యాలతో పాటు విధి విధానాలను తూచ తప్పకుండా నిర్వహించేందుకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశాం. ముఖ్యంగా అమ్మవారి ఉత్సవ వేదిక వద్ద అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు విరాళాలు ఇస్తుంటారు. ఆ మొత్తం అమ్మవారి ఉత్సవాల కోసం ఖర్చు చేస్తుంటాం.

– ఎద్దు శ్రీహరి, కమిటీ ఉపాధ్యక్షుడు



ఊరు చాటింపు వేస్తున్న దృశ్యం

స్థల చరిత్ర

రాయగడ గ్రామంలో సుఖ సంతోషాలతో ప్రజలు నివసిస్తుండేవారు. గ్రామస్తులంతా బురదల పోలమ్మను ఆరాధిస్తుండేవారు. ఈ క్రమంలో ఒకసారి గ్రామంలో మశూచి ప్రారంభం కావడంతో చిన్న పిల్లలకు ఆ వ్యాధి సోకి చనిపోతుండేవారు. దీంతో భయభ్రాంతులు వ్యక్తం చేసి గ్రామస్తులు ఈ మశూచి వ్యాధిని పారదోలేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశారు. అయితే వ్యాధి తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండడంతో పాటు దాని ప్రభావంతో ఎంతో మంది చిన్నపిల్లలు మృత్యువాత పడుతుండేవారు. గత్యంతరం లేని గ్రామస్తులు బురదల పోలమ్మను వేడుకుంటారు. దీంతో స్పందించిన బురదల పోలమ్మ గ్రామస్తులకు అభయం ఇస్తారు. మశూచి మహమ్మారిని తొలగించి ప్రజలను కాపాడుతానని భరోసా ఇస్తుంది. ఈ నేపథ్యంలో అమ్మవారికి ఎనిమిది మంది అక్కాచెల్లెల్లు, మజ్జి గౌరమ్మ, శాంత పోలమ్మ, బంగారమ్మ, అగ్ని గంగమ్మ, ఉగ్రతారమ్మ, ముత్యాలమ్మ, మరిడమ్మ, బండారమ్మలు బురదల పోలమ్మ అక్కాచెల్లెల్లు. వీరందరికీ ఒకే అన్నదమ్ముడు దువ్వెర పోతన్న. వీరంతా సమావేశమై మశూచి మహమ్మారి నుంచి గ్రామస్తులను కాపాడేందుకు కంకణం కట్టుకుంటారు. ఈ క్రమంలో ఊరు దక్షిణ దిశగా మజ్జిగౌరి, ఉత్తర దిశగా శాత పోలమ్మ, తూర్పు దిశగా ముత్యాలమ్మ ఇలా అన్ని ప్రాంతాల్లో ఒక్కొక్క అమ్మవారు మశూచి మహమ్మారి ఊరు లోపలకు ప్రవేశించకుండా ఉండేందుకు కాపలాగా ఉంటారు. బుదదల పోలమ్మ మాత్రం ఊరిలోనే ఉంటూ గ్రామస్తులను కంటికి రెప్పలా కాపాడేందుకు తిష్ట వేస్తారు. అందుకే బురదల పోలమ్మను గ్రామదేవతగా పిలుస్తారు. ఇదిలా ఉండగా చెరో దిశగా అమ్మవార్లు అంతా వెళ్లిపోవడంతో బురదల పోలమ్మకు రక్షణగా ఉండేందుకు అమ్మవారి అన్నదమ్ముడు దువ్వెర పోతన్న అమ్మవారితోనే ఊరుతో ఉండిపోతాడు. ఇప్పటికీ అమ్మవారి ప్రవేశ ద్వారం ఎడమ వైపు దువ్వెర పోతన్న గుడి ఉంది. అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ముందుగా దువ్వెర పోతన్నను పూజించిన అనంతరం అమ్మవారి ఉత్సవాలు ప్రారంభిస్తారు. ఇలా మశూచి మహమ్మారిని అమ్మవారులంతా కలిసి తరిమి కొడతారు. దీంతో గ్రామంలో సుఖశాంతులతో పాటు అంతా ఆయురారోగ్యాలతో ఉంటారు. గ్రామస్తులను కాపాడిన గ్రామదేవతకు ప్రతీ ఏడాది పండగ చేస్తామని గ్రామస్తులు నిర్ణయించుకుంటారు. అప్పటి నుంచి ప్రతీ ఏడాది జూన్ నెలలో తొమ్మిది రోజులు అమ్మవారి ఉత్సవాలు జరపిస్తుండడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సాంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతోంది. సాంప్రదాయబద్ధంగా పూజా విధానాలు నిర్వహిస్తున్నారు.

కువైట్ ప్రమాదంలో ఒడిశా వాసులు

- ప్రమాదంలో ఇద్దరు మృతి
- రాష్ట్రానికి చేరిన మృతదేహాలు
- రూ.4 లక్షల పరిహారం ప్రకటన



మృతదేహాలకు శ్రద్ధాంజలి ఘటించిన ప్రొటెం స్పీకర్ రణేంద్ర ప్రతాప్ స్వయిం



నివాళులర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్



నివాళులర్పించిన ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిదా



శ్రద్ధాంజలి ఘటించిన బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, మంత్రి పృథ్విరాజ్ హరిచందన్

భువనేశ్వర్: కువైట్‌లో జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మరణించారు. వీరి మృతదేహాలు శనివారం ఉదయం ప్రత్యేక విమానంలో భువనేశ్వర్ చేరుకున్నాయి. విమానం చేరే సమయానికి ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు కనక్ వర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడా, ప్రొటెం స్పీకర్ రణేంద్ర ప్రతాప్ స్వయిం, మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ విమానాశ్రయంలో ఉన్నారు. ఈ దుర్ఘటనలో మృతులు సంతోష్‌కుమార్ గౌడ్, మహ్మద్ జహూర్‌గా గుర్తించారు. సంతోష్ గౌడ్ గంజాం జిల్లా పురుషోత్తంపూర్ మండలం రొజొరుళి గ్రామానికి చెందినవాడు. మహ్మద్ జహూర్ కటక్ నగరం పరిధిలోని కరడపల్లి గ్రామానికి చెందినవాడు. మృతదేహాలను స్వగ్రామాలకు తరలించేలోపు మృతులకు నివాళులర్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.4 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారని ఉప ముఖ్యమంత్రి కనక్ వర్ధన్ సింగ్ దేవ్ తెలిపారు. వీరిద్దరూ ఉద్యోగం వెతుక్కుంటూ ఇద్దరూ కువైట్ వెళ్లారు. వీరు వేర్వేరు ప్రైవేట్ నిర్మాణ సంస్థల్లో పని చేస్తున్నారు. జహూర్ 2017 నుంచి కువైట్‌లో లేబొరేటరీ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడని, సంతోష్ రెండేళ్ల క్రితమే గల్ఫ్ దేశానికి వెళ్లాడని సంబంధిత వర్గాలు తెలిపాయి.

మంత్రి నిత్యానందకు ఘన స్వాగతం



నబరంగ్‌పూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మంత్రి నిత్యానంద గోండో

కొరాపుట్: రాజధాని భువనేశ్వర్ నుంచి జిల్లాకు తిరిగివచ్చిన క్యాబినెట్ మంత్రి నిత్యనంద గొండోకి ఘన స్వాగతం లభించింది. మంత్రిగా ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా శనివారం కొరాపుట్ జిల్లా కేంద్రానికి ఆయన వచ్చారు. అక్కడ మంత్రితో పాటు కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చోకి ప్రజలు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతర మంత్రి ర్యాలీతో జయపూర్ సబ్ డివిజన్ కమర వద్దకి చేరుకున్నారు. అక్కడ కోట్‌పాడ్ ఎమ్మెల్యే రుపుదర్ బోత్రకి మంత్రితో పాటు స్థానిక ప్రజలు స్వాగతం పలికారు. ఇంద్రావతి నది వద్దున నబరంగ్‌పూర్ జిల్లా సరిహద్దు వద్ద మంత్రితో పాటు నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జికి జిల్లా వాసులు స్వాగతం పలికారు. వందలాది ద్విచక్ర వాహనాల మీద ర్యాలీ చేపట్టారు. అనంతరం సర్క్యూట్ హౌస్ వద్ద మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. తమ ప్రభుత్వం నిజాయితీ, నిబద్ధతతో పని చేస్తుందన్నారు. నబరంగ్‌పూర్ జిల్లాలో గిరిజనులు ఉన్నతికి అవినీతి లేకుండా పని చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీష్ బిసోయి, మాజీ అధ్యక్షుడు రమేష్ సాహు, మున్సిపల్ చైర్మన్ కుసు నాయక్‌లు పాల్గొన్నారు.

'మునిషిపాదరొ'పై సీఎం మోహన్ ఆందోళన



రాయగడ: బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం



రాయగడ: చిన్నారుల ఆరోగ్య వివరాలను తెలుసుకుంటున్న శివపట్నాయక్

భువనేశ్వర్: రాయగడ జిల్లాలోని మునిషిపాదరొ గ్రామంలో ఇటీవల గుర్తు తెలియని వ్యాధితో 5 మంది వ్యక్తులు మరణించడంపై ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాధికి కారణాన్ని గుర్తించి పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. దీనికోసం సాధ్యమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మరణాలకు సంబంధించిన కారణాలను పరిశోధించి తెలుసుకోవాలని ఆరోగ్య శాఖ, ప్రాంతీయ వైద్య పరిశోధన కేంద్రం (ఆర్‌ఎమ్‌ఆర్‌సి)ని ఆదేశించారు. ప్రభావిత ప్రదేశానికి వీలైనంత త్వరగా సురక్షిత తాగునీటి సౌకర్యం కలిప్పించాలని, మోటారు రవాణాకు వీలుగా రహదారిని నిర్మించాలని పంచాయతీ రాజ్ శాఖను ముఖ్యమంత్రి ఆదేశించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. రాయగడ జిల్లా కాశీపూర్ మండలం మనుష్‌పాదొరా గ్రామంలో నెల రోజుల వ్యవధిలో గుర్తు తెలియని రోగం బారినపడి 5 మరణాలు సంభవించాయి. గ్రామం మారుమూల మరియు కష్టతరమైన ప్రాంతంలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వ బృందం ఆ ప్రాంతాన్ని సందర్శించి అవసరమైన పరిశోధనలు, ఇంటింటికి వెళ్లి స్క్రీనింగ్ మరియు చికిత్స చర్యలు చేపట్టింది. ఆరోగ్య బృందాలు ప్రతిరోజూ పర్యటిస్తూ పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నాయి. మొదటి నాలుగు మరణాలకు సంబంధించి ఆరోగ్య సదుపాయ కేంద్రం లేదా ఆరోగ్య కార్యకర్తలతో సంప్రదించకుండా సహజ స్థాయిలో దహన క్రియలు ముగించినట్లు తెలిపారు. అయితే అవి డిఫ్తీరియా కేసులుగా అనుమానిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. 5వ మరణం విషయంలో నమూనాలను పరీక్ష కోసం ఆర్‌ఎంఆర్‌సీకి సిఫారసు చేశారు. ఈ సంస్థ పరిశీలనలో వ్యక్తి మరణానికి డిఫ్తీరియా కారణమని శనివారం నిర్ధారించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభావిత ప్రాంతంలో ఈ రోగ నిరోధక చర్యలు చురుకుగా సాగుతున్నాయి. పరిస్థితులు అదుపులో ఉన్నట్లు సంబంధిత వర్గాలు అభయం ఇచ్చాయి. పీడితులు చికిత్సకు స్పందిస్తున్నట్లు పేర్కొన్నారు.

గ్రామంలో బీజేపీ బృందం పర్యటన

రాయగడ: కాసీపూర్ సమితి డొంగాశిలి పంచాయతీలోని మునిషిపాదొరా గ్రామంలో బీజేపీ నాయకుల బృందం శనివారం పర్యటించింది. జిల్లా బీజేపీ అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు కాశీరాం మాఝి, ఆ పార్టీ సీనియర్ నాయకుడు ప్రతాప్ పువ్వల తదితరులు పర్యటించి అక్కడ స్థితిగతులను పరిశీలించారు. గత కొద్దిరోజులుగా ఈ గ్రామంలో అంతుచిక్కని వ్యాధి ప్రబలడంతో ఆ వ్యాధి బారినపడి ఇప్పటికే ఐదుగురు చిన్నారులు మృతి చెందగా, మరో నలుగురు వ్యాధితో సతమతమవుతూ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తాజాగా మరి కొందరు సమితిలోని వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆ గ్రామంలో పర్యటించిన బీజేపీ బృందం బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేసింది. అనంతరం డొంగాశిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాధితో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి, వారి ఆరోగ్య వివరాలను సంబంధిత వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించి వ్యాధి నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా వ్యాధి ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా తగు చర్యలు తీసుకోవాలని, అందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని వైద్యశాఖను అభ్యర్థించారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

రాష్ట్రంలో బీజేపీ పాలనలో గ్రామాల్లో మౌలిక సదుపాయాలతో ప్రజలు అభివృద్ధిని చూస్తారని జిల్లా బీజేపీ అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్ అన్నారు. ఇప్పటివరకు ఈ సమితిలో మౌలిక సౌకర్యాలు లేని గ్రామాలు కొకొల్లలుగా ఉన్నాయన్నారు. రహదారులు లేని గ్రామాల కారణంగా సరైన వైద్య సౌకర్యాలు పొందలేక నిత్యం ఇటువంటి తరహా వ్యాధుల బారినపడి ఎంతోమంది మృత్యువాత పడుతుండడం పరిపాటిగా మారిందన్నారు. ఇక నుంచి రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్యే నారాయణరావు



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నారాయణరావు

పర్లాకిమిడి: ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మోహన్ చరణ్ మఝిని పర్లాకిమిడి మాజీ ఎమ్మెల్యే కోడూరు నారాయణ రావు మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు. ఆయనతో పాటు గారబంద మాజీ సర్పంచ్ వేణు, మాజీ చైర్మన్ (కాశీనగర్) ఛిత్రి సింహాద్రి, పాత్రో తదితరులు ఉన్నారు.

ప్రాణం తీసిన సెల్ఫీ సరదా

- ఇద్దరు అన్నదమ్ములు మృతి



సందీప్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



ప్రదీప్ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖోయిర్‌పూట్ సమితి మడ్కపోదర్ గుమ్మ జలపాతంలో సెల్ఫీ తీసుకుంటూ జారిపడి అన్నదమ్ములు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. జయపూర్ బైపాస్ రోడ్డులో నివాసముంటున్న అన్నదమ్ములు ప్రదీప్ సాహు(29), సందీప్ సాహు(26)లు తమ తల్లిదండ్రులతో కలిసి రొజ్జొ వేడుకలు జరుపుకోవడం కోసం ఖోయిర్‌పూట్ సమితిలోని గోవిందపల్లిలో అక్క ఇంటికి శుక్రవారం వెళ్లారు. అనంతరం శనివారం ఉదయం కుటుంబ సభ్యులంతా కలిసి గుమ్మ జలపాతం చూడడానికి వెళ్లారు. అక్కడ అంతా సంతోషంగా కొంత సమయం గడిపారు. అయితే ఈ అన్నదమ్ములు ఇద్దరూ ఒక సెల్ఫీ తీసుకోవడం కోసం జలపాతం మధ్యన ఉన్నటువంటి ఒక రాయిపై నిలబడ్డారు. ఆ సమయంలో అన్న ప్రదీప్ జలపాతంలో పడిపోయాడు. దీంతో అన్నను రక్షించడానికి తమ్ముడు దూకడంతో ఇద్దరూ నీటిలో మునిగిపోయారు. కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో పక్కనే ఉన్నటువంటి రైతులు వచ్చి నీటిలో దూకి మొదట తమ్ముడిని బయటకు తీశారు. వెంటనే ఖోయిర్‌పూట్ ఆరోగ్య కేంద్రంకు తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి సందీప్ మృతి చెందినట్లు నిర్ధారించారు. సాయంత్రంకు ప్రదీప్ మృతదేహం కూడా లభ్యమైంది. విషయం తెలిసిన వెంటనే ఖోయిర్‌పూట్ తహసీల్దార్ ప్రమోద్ కుమార్ బెహర సంఘటన స్థలానికి వెళ్లారు. అక్క కళ్ల ముందే ఇద్దరు తమ్ముళ్లు చనిపోవడంతో ఆమె కన్నీరుమున్నీరు అవుతున్నారు. ఖోయిర్‌పూట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని వెల్లడించారు.



జలపాతం మధ్యలో ఉన్నటువంటి రాయి

పాముకాటుతో వృద్ధుడు మృతి

కవిటి: మండలంలోని గొర్లెపాడుకు చెందిన తీగల త్రినాథ్(80) పాముకాటుకు గురై మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 13వ తేదీ రాత్రి త్రినాథ్‌కు తన ఇంటి పరిసరాల్లోనే పాము కాటు వేసింది. వెంటనే ఆయనను సోంపేట సామాజిక ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడి నుంచి బరంపురం ఎంకేసీజీ ఆస్పత్రికి తరలించారు. కానీ ఆస్పత్రిలో చేర్చే ముందే ఆయన మృతి చెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. సోంపేటలో సకాలంలో వైద్యం అంది ఉంటే బతికి ఉండేవారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

దొంగల గుట్టురట్టు



బాధితుడు సామంతరాయ్‌కు నగదు అందజేస్తున్న పోలీసు అధికారి అంకిత్‌కుమార్ వర్మ

జయపురం: ఈనెల 6వ తేదీన ఒక స్కూటీ డిక్కీలో రూ.7 లక్షల దొంగిలించిన దొంగల గుట్టు పోలీసులు రట్టు చేశారు. ఈ ఘటనలో రాయగడలో ఒక మహిళను పోలీసులు అరెస్టు చేసినట్లు జయపురం సబ్ డివిజన్ పోలీసు అధికారి అంకిత్ కుమార్ వర్మ శనివారం వెల్లడించారు. ఘటనలో ప్రధాన నిందితులు తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లాకి చెందిన పి.దేవ, కె.చిన్నాలు ఉన్నట్లు పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే.. జయపురం మదలావీధికి చెందిన రాహుల్ దేవ్ సామంతరాయ్ ఈనెల 6వ తేదీన స్టేట్ బ్యాంక్‌లో రూ.7 లక్షలు డ్రా చేసి తన స్కూటీ డిక్కీలో ఉంచారు. అనంతరం జయపురం మెయిన్ రోడ్డులో ఒక షాపు ముందు స్కూటీ ఉంచి షాపులోకి వెళ్లాడు. అతడి తిరిగి వచ్చేసరికి స్కూటీ సీటు తెరచి ఉండడం చూశాడు. డిక్కీలో ఉంచిన డబ్బు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు దర్యాప్తు చేసిన పోలీసులు సీసీ కెమేరాల ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు చర్యలు తీసుకున్నారు. ఫుటేజీలను ఇతర జిల్లాల పోలీసుస్టేషన్లకు పంపారు. తద్వారా నిందితులు రాయగడలో ఉన్నట్లు కనుగొన్నారు. రాయగడలో పోలీసులు నిందితులు ఉంటున్న ఇంటిపై దాడి జరిపి ఒక మహిళను అరెస్టు చేశారు. అరెస్టైన ఆ మహిళ నుంచి వివరాలు సేకరించారు. దొంగతనం చేసినవారు తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారని తెలుసుకున్నట్లు పోలీసు అధికారి వర్మ వెల్లడించారు. వెంటనే పోలీసులు తెలంగాణ వెళ్లారు.



దొంగల ఇంటిలో సీజ్ చేసిన డబ్బు

నిందితుల గ్రామం వెళ్లిన పోలీసులు దేవ్, చిన్నాల ఇళ్లపై దాడులు జరిపారు. అయితే పోలీసులను చూసిన ఇద్దరు దొంగలు పారిపోయారు. వారి ఇంట్లో రూ.4.20 లక్షలు సీజ్ చేసినట్లు పోలీసులు తెలియజేశారు. డబ్బు పోగొట్టుకున్న రాహుల్‌దేవ్ సామంతరాయ్‌కు పోలీసులు జప్తు చేసిన డబ్బులు అందించారు. పారిపోయిన నిందితుల కోసం విస్తృతంగా గాలిస్తున్నారు.

చల్లని కబురు



- రాష్ట్రానికి వర్ష సూచన

భువనేశ్వర్: వేడితో ఉక్కిరిబిక్కిరి అవుతున్న రాష్ట్ర ప్రజానికానికి త్వరలో ఉపశమనం లభించనుంది. మరి కొద్దిరోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శనివారం తెలిపింది. ఆదివారం నాటికి కొరాపుట్, రాయగడ, గజపతి జిల్లాలతో పాటు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని స్థానిక వాతావరణ కేంద్రం డైరెక్టర్ మనోరమా మహంతి తెలిపారు. రెండు రోజుల తర్వాత వర్షాల తీవ్రత పెరుగుతుందన్నారు. దీంతో రాష్ట్రంలోని చాలా చోట్ల రెండు రోజుల తర్వాత పగటిపూట గరిష్ఠ ఉష్ణోగ్రత క్రమంగా 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ తగ్గే అవకాశం ఉందన్నారు. రానున్న 24 గంటల్లో కొరాపుట్, మల్కన్‌గిరి, నవరంగ్‌పూర్, రాయగడ, తీరప్రాంత ఒడిశా, మయూర్‌భంజ్, కెంజొహర్, ఢెంకనాల్, కలహండి, కందమాల్ జిల్లాల్లో కొన్నిచోట్ల ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

ఈదురుగాలుల తీవ్రత

మయూర్‌భంజ్, కెంజొహర్, బాలాసోర్, భద్రక్, కేంద్రాపడా, జాజ్‌పూర్, మల్కన్‌గిరి, కొరాపుట్, రాయగడ, గజపతి, గంజాం, నవరంగ్‌పూర్‌లోని కొన్ని ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచి, మెరుపులతో కూడిన ఉరుములు, మెరుపులతో కూడిన తుఫాను వాతావరణం అలముకునే అవకాశం ఉందని వాతావరణ సంస్థ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. అలాగే వర్ష వాతావరణం మధ్య రాబోయే 24 గంటల్లో బాలాసోర్, కెంజొహర్, మయూర్‌భంజ్, సుందర్‌గఢ్, ఝార్సుగుడ, సంబల్‌పూర్, బొలంగీర్, సోన్‌పూర్, బౌధ్, నువాపడా జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల వడగాడ్పుల పరిస్థితి నెలకొనే అవకాశం ఉంది. ఈ వ్యవధిలో బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రాపడా, కటక్, జగత్‌సింగ్‌పూర్, పూరి, ఖుర్ధా, నయాగఢ్, గంజాం, గజపతి జిల్లాల్లో ఒకటి లేదా రెండు ప్రదేశాల్లో వేడి, తేమతో కూడిన వాతావరణ పరిస్థితులు నెలకొనవచ్చు.

అక్రమంగా తరలిస్తున్న తాబేళ్ల పట్టివేత



పట్టుబడిన తాబేళ్లు



అరెస్టైన నలుగురు నిందితులు

కొరాపుట్: అక్రమంగా తరలిస్తున్న 176 ఆలివ్ రిడ్లే తాబేళ్లను అధికారులు పట్టుకున్నారు. నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ డివిజన్ జోరిగాం అటవీ శాఖ సిబ్బందికి తాబేళ్ల అక్రమ తరలింపుపై ముందస్తు సమాచారం వచ్చింది. దీంతో శనివారం ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో రెండు ద్విచక్ర వాహనాల మీద గోనె సంచులతో తాబేళ్లు రవాణా చేస్తుండడం గుర్తించారు. దీంతో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వాటి బరువు రెండు క్వింటాళ్లు ఉంటుందని పేర్కొన్నారు. వీటిని కలహండి జిల్లా నుంచి నబరంగ్‌పూర్ జిల్లాకి తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకి తరలించినట్లు అటవీ శాఖ రేంజర్ గోవింద నాయక్ ప్రకటించారు. పట్టుబడిన తాబేళ్లని అటవీ శాఖ ఆధ్వర్యంలో సంరక్షించనున్నట్లు ప్రకటించారు.

విజృంభిస్తున్న మలేరియా



రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం సభ్యులు

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితిలో మలేరియా విజృంభిస్తోంది. సమితిలోని దండాబడి పంచాయతీ కలియఅటల్ గ్రామంలో ప్రతీ కుటుంబంలోనూ మలేరియా బాధితులు ప్రస్తుతం కనిపిస్తున్నారు. ఈ గ్రామంలో 45కి పైగా ఆదివాసీ కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇటీవల 5 నెలలు క్రితం వివాహం జరిగిన ఒక యువతి కమల జాని మలేరియా వలన మరణించింది. ఆమె జ్వరంతో పీడించబడడంతో బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రిలో చేర్చారు. ఆమెను పరీక్షించిన డాక్టర్లు ఆమెది మలేరియ జ్వరం అనే అనుమానంతో పరీక్షలు జరిపారు. మలేరియా అని నిర్ధారణ కాగా వైద్యం చేస్తుండగా మరణించింది. దీంతో ఒక వైద్యబృందం గ్రామంలో శనివారం పర్యటించింది. బృందం సభ్యులు గ్రామంలో ప్రజల బ్లడ్ శాంపిల్స్ సేకరించారు. 15 మందికి రక్త పరీక్షలు చేయగా నలుగురికి మలేరియా ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ శనివారం తన మంత్రి మండలికి శాఖలను కేటాయించారు. ముఖ్యమంత్రి సలహా మేరకు మంత్రుల శాఖల కేటాయింపునకు గవర్నర్ రఘుబర్ దాస్ ఆమోదం తెలిపినట్లు రాజ్‌భవన్ నుంచి అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. ముఖ్యమంత్రి హోం, సాధారణ పరిపాలన మరియు ప్రజాభియోగాలు, సమాచార మరియు ప్రజా సంబంధాలు, జల వనరులు మరియు ప్రణాళిక మరియు కన్వర్జెన్స్ విభాగాలను తన వద్ద ఉంచుకున్నారు. ఏ మంత్రికి కేటాయించని ఇతర శాఖలను కూడా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ నిర్వహిస్తారు. ఆర్థిక శాఖ ఎవరికి కేటాయించనందున ముఖ్యమంత్రి అధీనంలోనే ఉంటుంది.

మంత్రి పేరు	శాఖలు
కనకవర్ధన్ సింగ్ దేవ్(డిప్యూటీ సీఎం)	విద్యుత్, వ్యవసాయం, రైతు సాధికారత
ప్రభాతి పరిడా(డిప్యూటీ సీఎం)	మిషన్ శక్తి, పర్యాటకం, మహిళా, శిశు సంక్షేమాభివృద్ధి
సురేష్ పూజారి	విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ
రబీ నారాయణ్ నాయక్	గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, తాగునీరు
నిత్యానంద గోండ్	పాఠశాల, సామూహిక విద్య, షెడ్యూల్డ్ తెగ, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, బలహీన, వెనుకబడిన తరగతుల సంక్షేమం, సామాజిక భద్రత, దివ్యాంగుల సాధికారత
కృష్ణచంద్ర పాత్రో	ఆహార సరఫరాలు, వినియోగదారుల సంక్షేమం, సైన్స్ అండ్ టెక్నాలజీ
పృథ్వీరాజ్ హరిచందన్	న్యాయ, నిర్మాణం, ఎక్సైజ్
డాక్టర్ ముఖేష్ మహాలింగ్	ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, శాసనసభ వ్యవహారాలు, ఎలక్ట్రానిక్స్, సాంకేతిక సమాచారం
బిభూతి భూషణ్ జెనా	వాణిజ్యం, రవాణా, ఉక్కు, గనులు
కృష్ణచంద్ర మహాపాత్రో	గృహ నిర్మాణం, నగర అభివృద్ధి, ప్రభుత్వ రంగ సంస్థలు
గణేష్‌రామ్ సింగ్ ఖుంటియా	అటవీ, పర్యావరణం, వాతావరణ మార్పు, కార్మిక, ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్
సూర్యవంశీ సూరజ్	ఉన్నత విద్య, క్రీడలు, యువజన సేవలు, ఒడియా భాషా సాహిత్యం, సంస్కృతి
ప్రదీప్ బాల సామంత	సహకారం, చేనేత, జౌళి, హస్తకళలు
గోకులానంద మల్లిక్	మత్స్య, జంతు వనరుల అభివృద్ధి, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు
సంపద్ చంద్ర స్వైన్	నైపుణ్యాభివద్ధి, సాంకేతిక విద్య

పోలీసు అధికారులతో సీఎం సమీక్ష



పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీఎం మోహన్ చరణ్



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీజీపీ అరుణ్ షడంగి

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ స్థానిక రాష్ట్ర అతిథి గృహంలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో రాష్ట్రంలో సమగ్ర శాంతిభద్రతలను శనివారం సమీక్షించారు. ముఖ్యమంత్రి అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు. సమావేశం అనంతరం రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు అరుణ్ షడంగి మాట్లాడుతూ ఇదో మర్యాదపూర్వకమైన భేటీ అన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించి రాష్ట్రంలో పోలీసుశాఖ పనితీరును ముఖ్యమంత్రికి వివరించినట్లు తెలిపారు. కింది స్థాయి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాల్సిన అవసరాన్ని పోలీసు అధికారులకు ముఖ్యమంత్రి నొక్కి చెప్పారు. నాణ్యమైన సేవలు అందించడంలో భాగంగా వివిధ పోలీసుస్టేషన్‌లకు వచ్చే ప్రజల ఫిర్యాదులను వినాలని ముఖ్యమంత్రి పోలీసు అధికారులను ఆదేశించారు. డీజీపీ అరుణ్ షడంగితో పాటు అదనపు డైరెక్టర్ జనరల్స్ ఆఫ్ పోలీస్ సంజయ్ కుమార్, ఆర్.కె.శర్మ, అరుణ్ బోత్రా, అమితాబ్ ఠాకూర్, ఇంటెలిజెన్స్ డైరెక్టర్ సౌమేంద్ర ప్రియదర్శి, భువనేశ్వర్ - కటక్ జంట నగరాల పోలీసు కమిషనర్ సంజీబ్ పండా, హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి సంతోష్ బాలా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రొజ్జొ

ఒడిశా ప్రజలకు అతి ప్రియమైన రొజ్జొ వేడుకలు రెండో రోజు శనివారం వైభవంగా జరుపుకున్నారు. మహిళలు, యువతులు ఊయలలు ఊగుతూ ఆనందంగా గడిపారు. పాన్ దుకాణాలకు ప్రజలు పోటెత్తారు. పలుచోట్ల ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి పండగ ప్రాధాన్యతను వివరించారు.

- సాక్షి నెట్‌వర్క్



జయపురం: ఉత్సాహంగా ఊయల ఊగుతున్న మహిళలు



మల్కన్‌గిరి: ఊయల ఊగుతున్న చిన్నారులు



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో గిరిజన మహిళల సంబరాలు



పర్లాకిమిడి: ఊయలూగుతున్న మహిళలు



కొరాపుట్: రొజ్జొ వేడుకల్లో మహిళలు



పర్లాకిమిడి: ఊయల ఊగుతున్న విద్యార్థినులు



మల్కన్‌గిరి: ఊయల ఊగుతున్న మహిళ



జయపురం: రథోపాడియ కూడలి వద్ద పాన్‌ల ప్రదర్శన



పర్లాకిమిడి: వివిధ పోటీలకు హాజరైన విద్యార్థినులు

న్యూస్‌రీల్

జంతు సంక్షేమ చట్టాలను ఉల్లంఘిస్తే చర్యలు

- జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వరరావు

విజయనగరం ఫోర్ట్: బక్రీద్ పండగ (ఈ నెల 17) సందర్భంగా జంతు సంక్షేమ చట్టాలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. అక్రమ పశువధ, జంతు రవాణా నేరమన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రిజర్వేషన్ అండ్ ప్రొహిబిషన్ ఆఫ్ స్లాటర్ యాక్ట్–1977, ట్రాన్స్‌ఫోర్ట్ ఆఫ్ యానిమల్ రూల్స్–1978, 2001 జంతు సంక్షేమ చట్టాలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై జిల్లాలో పశు సంవర్ధక శాఖ అధికారులు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు దృష్టి సారించాలని ఆదేశించారు.

గోమాతకు సీమటంతం


పుంగనూరు గోవుకు సీమంతం చేస్తున్న భక్తులు

గుర్ల: మండల కేంద్రంలోని శివాలయంలో పుంగనూరు గోవుకు భక్తులు శనివారం సీమంతం చేశారు. శివాలయంలో గోమాతకు శ్రీమంతం చేయడం ఇదే మొదటిసారి అని ఆలయ అర్చకుడు సురేష్ శర్మ తెలిపారు. మహిళలకు తాంబులాలు ఇచ్చారు. గోవుల పరిరక్షణకు అందరు కృషి చేయాలని భక్తులు పిలుపునిచ్చారు.

జాబ్‌మేళాకు 89 మంది హాజరు


జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులనుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పనాధికారి అరుణ

విజయనగరం ఫూల్‌బాగ్: జాబ్ డీలర్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీకి జిల్లా ఉపాధి కల్పనాశాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఐటీఐలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు 89 మంది హాజరయ్యారు. వీరిలో 42 మందిని తదుపరి రౌండ్‌కు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.అరుణ మాట్లాడుతూ ఉపాధి కల్పన కోసం ఏర్పాటుచేస్తున్న జాబ్‌మేళాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంలు కె.రామచంద్రరావు, కె.లక్ష్మణరావు, హెచ్‌ఆర్ సందీప్, యంగ్ ప్రొఫెషన్ ఎం.యశ్వంత్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో ఒకరి అరెస్ట్

గంట్యాడ: గంజాయి తరలిస్తున్న ఒకరిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక రూరల్ సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీనివాసరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ సురేంద్రనాయుడు శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడ మండలం శెట్టిబంద గ్రామానికి చెందిన వంతలు డంబుతో పాటు మరో నలుగురు వ్యక్తులు ఒడిశా రాష్ట్రంలోని మల్కనగిరి నుంచి 49 కిలోల గంజాయిని తీసుకువచ్చి విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఓ వ్యక్తికి అప్పగించేందుకు బేరం కుదుర్చుకున్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం నిందితులు ఆటోలో గంజాయి తీసుకువస్తూ కొఠారుబిల్లి జంక్షన్ వద్దకే వచ్చేసరికి సరుకు అప్పగించాల్సిన వ్యక్తికి ఫోన్ చేశారు. ఆయన ఆర్టీసీ కాంప్లెక్స్‌కు రావడానికి కొంత సమయం పడుతుందని చెప్పడంతో నిందితులు బుడతానపల్లి రోడ్డులో ఉన్న ప్రభుత్వ కళాశాల వద్దకు చేరుకున్నారు. ప్రధాన నిందితుడు డంబును అక్కడే ఉంచి మిగిలిన నలుగురు బయటకు వెళ్లారు. గంజాయి తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది కలిసి దాడిచేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయితో ఉన్న ఆటోను సీజ్ చేశారు. డంబును కోర్టులో హాజరుపరచి న్యాయమూర్తి ఆదేశాల మేరకు సబ్ జైల్‌కు తరలించారు. మిగిలిన నలుగురు నిందితులను త్వరలోనే పట్టుకుంటామని సీఐ చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్య



రాజాం సిటీ: మండల పరిధి గడిముడిదాం గ్రామానికి చెందిన ముడిదాన గురయ్య (42) శనివారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. గురయ్య తన భార్యాపిల్లలతో కలిసి విశాఖపట్నం ఉంటున్నాడు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల సార్వత్రిక ఎన్నికలు జరగడంతో స్వగ్రామానికి వచ్చి మళ్లీ విశాఖ వెళ్లిపోయాడు. వారం రోజుల కిందట టీవీ తీసుకువచ్చి ఇంటిలో ఒక్కడే ఉంటున్నాడు. ఎవ్వరితో మాట్లాడేవాడు కాదు. ఇదిలా ఉంటే శనివారం మధ్యాహ్నం ఇంటిలో నుంచి మాడు వాసన రావడంతో స్థానికులు చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి శివయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వై. రవికిరణ్ తెలిపారు.

ఈదురు గాలుల బీభత్సం


విజయనగరం పట్టణంపై కమ్ముకున్న మేఘాలు


సంతకవిటి: గోళ్లవలస రహదారిపై కూలిన చెట్టు


వంగర: కోనంగిపాడులో ట్రాక్టర్‌పై కూలిన చెట్టు


వేపాడ: తహసీల్దార్ కార్యాలయంవద్ద పడిపోయిన చెట్టు, గోడ

- కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- రాకపోకలకు అంతరాయం
- నిలిచిన విద్యుత్ సరఫరా
- పిడుగుల వానతో జనం బెంబేలు


దోలపేటలో పిడుగుపాటుకు గురై మృతిచెందిన ఆవు

సాక్షి నెట్‌వర్క్: విజయనగరం జిల్లాలోని పలు మండలాల్లో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలుల ధాటికి చెట్లు కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. భారీ నష్టం వాటిల్లింది. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల్లో ఆ శాఖ సిబ్బంది వర్షంలోనే పరుగులు తీశారు.

- సంతకవిటి మండలంలోని అన్ని గ్రామాల్లోనూ గాలివాన బీభత్సం సృష్టించింది. సంతకవిటిలో ఇంటి పైకప్పులు, షాపుల పైకప్పులు ఎగిరిపోవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు.
- వంగర మండలం కోనంగిపాడులో చందక కృష్ణమూర్తికి చెందిన ట్రాక్టర్‌పై చెట్టు కూలిపోయింది. స్థానికులు చెట్ల కొమ్మలు తొలిగించి ట్రాక్టర్‌ను బయటకు తీశారు.
- వేపాడ మండలంలోని వేపాడ, వల్లంపూడి గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. వల్లంపూడి నుంచి చామలాపల్లి వెళ్లే రహదారిలో దబ్బిరాజుచెరువు గట్టు, చామలాపల్లి సమీపంలో చెట్లు, స్తంభాలు పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. వేపాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద చెట్టుతో పాటు ఓ వైపు గోడ పడిపోవడంతో విద్యుత్ తీగలు తెగిపోయాయి. రెడ్డివీధిలో ఒకటి, రాజవీధిలో ఒకటి, పోలీస్ స్టేషన్ సమీపంలో ఒకటి, శానాపతి వీధిలో ఒక విద్యుత్ స్తంభం విరిగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.
- బాడంగి మండలంలోని వీరసాగరంలో ఎల్‌టీ లైన్‌కు చెందిన మూడు స్తంభాలు, గొల్లాదిలో వ్యవసాయ పంపు సెట్‌కు చెందిన రెండు స్తంభాలు, గజరాయునివలస గ్రామాల్లో చింతకొమ్మలు, టేకు చెట్లు పడిపోవడంతో మరో స్తంభం విరిగిపోయినట్టు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు చెప్పారు. ఈదురుగాలులకు మండలంలో విద్యుత్‌శాఖకు సుమారు లక్షా50వేల వరకు నష్టం వాటిల్లిందన్నారు.
- రాజాం పట్టణంతో పాటు మండలంలో ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. రాజాం, సంతకవిటి మండలాల ప్రధాన రహదారిపై ఎక్కడికక్కడే చెట్లు రోడ్డుకు అడ్డంగా పడడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. డోలపేట పెద్దవీధిలో ఓ పశువులపాకకు ఆనుకుని ఉన్న చెట్టుపై పిడుగుపడింది. దీంతో పశువులపాకలో ఉన్న డోల గాంధీకి చెందిన రూ.40వేలు విలువైన ఆవు పిడుగుపాటుకు గురై మృతిచెందింది.

రైతు ప్రాణం తీసిన విద్యుత్ వైర్లు


మృతి చెందిన కెల్ల అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: తెగిపడిన విద్యుత్ వైర్లు తగిలి రైతు మృతి చెందిన ఘటన నెల్లిమర్ల మండలం అలుగోలు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అలుగోలు గ్రామానికి చెందిన కెల్ల అప్పలనాయుడు(65) శనివారం వేకువ జామున ఆవుల పాలు తీసేందుకు కల్లాం వద్దకు వెళ్తుండగా, సమీపంలోని రామప్పుడు కల్లాల వద్ద శుక్రవారం రాత్రి గాలి, వానకు తెగిపడిన విద్యుత్ వైర్లు ఆయన ఛాతికి తగలడంతో షాక్‌కు గురయ్యాడు. అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. మృతుడు కుమారుడు రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామగణేష్ తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

భామిని: భార్య మాట వినడం లేదని తీవ్ర మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే... మండలంలోని బిల్లుమడ కాలనీలో గంగాధర పద్మనాభం చిన్న హోటల్ నడుపుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. శుక్రవారం ఉదయం హోటల్ తీసే సమయానికి అతని భార్య రాకపోవడంతో మందలించాడు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో మనస్తాపానికి గురైన పద్మనాభం పురుగు మందు తాగాడు. వెంటనే భార్య, స్థానికులు గమనించి 108 వాహనంలో భామిని పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పి. కాంతారావు తెలిపారు.

చేపల వేట ఆరంభం

తొలిరోజు చింతపల్లి తీరంలో వేట చేసుకొని బోటులో ఒడ్డుకు చేరుతున్న మత్స్యకారులు



- 61 రోజుల విరామం తరువాత ఉత్సాహంగా వేటకు వెళ్లిన మత్స్యకారులు
- జిల్లాలో మొదటిరోజు 420 బోట్లపై వేటకు..
- తొలుత గంగమ్మతల్లికి పూజలు
- మత్స్యసంపదతో తిరిగి ఒడ్డుకు..


వలకు చిక్కిన మత్స్యసంపదను కొనుగోలు చేయడానికి పోటీ పడుతున్న వ్యాపారులు

పూసపాటిరేగ: సముద్రంలో వేట నిషేధం గడువు ముగిసింది. మత్స్యకారులు శనివారం తెల్లవారు జామున వేటకు శ్రీకారం చుట్టారు. పూసపాటిరేగ, భోగాపురం తీరప్రాంతంలోని మత్స్యకారులు తొలుత గంగమ్మతల్లికి పూజలు చేశారు. అనంతరం 420 బోట్లలో సముద్రంలో వేటకు బయలుదేరారు. చింతపల్లి, పతివాడ బర్రిపేట, తిప్పలవలస, తమ్మయ్యపాలెం, పులిగెడ్డపేట, ముక్కాం, చేపలుకంచేరు, కొండ్రాజుపాలెం రేవుల నుంచి వేట సాగించారు. సాధారణ వలకు ముగ్గురు, ఇంజిన్‌బోటుపై ఆరు నుంచి ఎనిమిది మంది వరకు సుమారు 5 నుంచి 20 కిలో మీటర్ల దూరం వరకు సంద్రంలోకి వెళ్లారు. వలకు చేపలు చిక్కిన వారు మధ్యాహ్నం 12 గంటలకు ఒడ్డుకు చేరుకున్నారు. ఒక్కో బోటుకు రూ.6వేలు నుంచి రూ.15వేలు విలువచేసే మత్స్యసంపద దొరకడంతో సంతోషం వ్యక్తంచేశారు. తీరంలోనే చేపలను విక్రయించారు.

తొలిరోజు వేట బాగుంది



రెండు నెలలు వేట విరామం తరువాత ఇష్ట దైవానికి పూజలు చేసి శనివారం వేకువ జామున సముద్రంలో వేటకు బయలుదేరాం. మత్స్య సంపద వలకు చిక్కిన తరువాత మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఒడ్డుకు చేరాం. మొదటిరోజు వేట సంతృప్తికరంగానే సాగింది.
– మైలపల్లి కొండ, మత్స్యకారుడు చింతపల్లి

వేట నిషేధ భృతి అనుమానమే



గత నాలుగేళ్లుగా ఏటా చేపలవేట నిషేధ సమయంలో ఠంచన్‌గా రూ.10వేలు చొప్పున పరిహారం బ్యాంకు ఖాతాకు జమయ్యేది. ఈ ఏడాది ఎన్నికల కోడ్ అని ఆలస్యం చేశారు. ఇప్పుడు వచ్చిన కొత్త ప్రభుత్వం వేటనిషేధ భృతిని రూ.20వేలకు పెంచి చెల్లిస్తామని హామీ ఇచ్చింది. ఆ డబ్బులు ఎప్పుడు వేస్తారో తెలియడం లేదు. ఆర్థిక కష్టాలతో ఇబ్బందులు పడుతున్నాం. త్వరితగతిన భృతిచెల్లించి మత్స్యకారులను ఆదుకోవాలి. – చిన్నిపిల్లి నీలయ్య, మత్స్యకారుడు, చింతపల్లిబర్రిపేట

ఇదేమి చోద్యం..!


ఇళ్ల స్థలాల్లో జేసీబీతో పిల్ల కాలువ పనులు చేపడుతున్న దృశ్యం

- నిరుపేదల ఇళ్ల స్థలాల్లో 'తోటపల్లి' పిల్ల కాలువ తవ్వకాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ గ్రామంలో నిరుపేదలకు ఇచ్చిన స్థలాల్లో తోటపల్లి ప్రాజెక్ట్ పిల్ల కాలువ తవ్వకాలు చేపడుతున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దమరసింగి వెళ్లే రహదారిలో సర్వే నంబర్ 45/1లో సుమారు 16 మంది నిరుపేదలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అధికారులు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అయితే స్థానిక టీడీపీ నాయకులు కావాలనే అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి తోటపల్లి కెనాల్ కాలువ నుంచి ఇళ్ల స్థలాల మీదుగా అక్రమంగా పిల్ల కాలువను తవ్విస్తున్నారు. ఇదిలా ఉంటే ఇళ్ల స్థలాలకు ఆనుకుని పూర్వం కాలువ ఉండేదని, మట్టితో కప్పేయడంతో పాత కాలువనే తిరిగి తీస్తున్నామని రైతులు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై తహసీల్దార్ ధర్మరాజు వివరణ కోరగా.. ఫిర్యాదు అందితే పరిశీలిస్తామని, ఇళ్ల స్థలాల మధ్యలో కాలువ నిర్మాణం చేపడితే తొలగిస్తామన్నారు. తోటపల్లి జేఈ సంతోషి స్పందిస్తూ ఇళ్ల స్థలాలు తోటపల్లి కాలువ పరిధిలో లేవని, పూర్వం నుంచి ఉన్న కాలువనే తవ్వుతున్నట్లు అక్కడి రైతులు తమకి చెప్పారని బదులిచ్చారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కొత్తవలస: కొత్తవలస నుంచి విజయనగరం వైపు వెళ్లే రైల్వేలైన్‌లో నిమ్మలపాలెం గ్రామ సమీపంలో గల రైల్వే బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు శనివారం గుర్తించారు. ఈ మేరకు రైల్వే పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై రవివర్మ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయసు 50 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉంటుందని.. నీలం రంగు షర్ట్ ధరించాడాని ఎస్సై చెప్పారు. మృతుడి వద్ద తాపీపని చేసే సామగ్రి ఉన్నట్లు గుర్తించారు. శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని విజయనగరం రైల్వే ఆస్పత్రికి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని కోరారు.

పిడుగు పాటుకు గేదె మృతి


శృంగవరపుకోట: మృతి చెందిన పాడిగేదె


రాజాం సిటీ: పిడుగు ధాటికి ధ్వంసమైన ఇంటి గోడ

శృంగవరపుకోట: పిడుగు పాటుకు గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని సీతారాంపురంలో చోటుచేసుకుంది. శనివారం సాయంత్రం మండల వ్యాప్తంగా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ సమయంలో పిడుగులు కూడా పడడంతో సీతారాంపురంలో ఆర్. శంకరరావుకు చెందిన గేదె మృతి చెందింది. సుమారు లక్షా యాభై వేల రూపాయల విలువైన గేదె చనిపోవడంతో బాధితుడు కన్నీరుమున్నీరవుతున్నాడు.

కొండపేటలో..

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి కొండంపేటలో పిడుగులు పడి పలువురి ఇళ్లల్లో గృహోపకరణాలు ధ్వంసమయ్యాయి. శనివారం సాయంత్రం ఒక్కసారిగా మేఘావృతమై ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ఈ సమయంలో గ్రామానికి చెందిన అయ్యప్పస్వామి ఆలయ ధర్మకర్త ముద్దన సత్యారావు ఇంటిపై పిడుగుపడింది. దీంతో ఇంటి గోడ కూలిపోవడంతో పాటు టీవీ, ఫ్రిడ్జ్, వాషింగ్ మెషీన్, ఫ్యాన్ పాడయ్యాయి. అలాగే అదే వీధికి చెందిన చిప్పాడ సూర్యనారాయణ, రావి రాంబాబులతో పాటు మరికొంత మందికి చెందిన సుమారు 20 వరకు సీలింగ్ ఫ్యాన్లు, 10 వరకు టీవీలు కాలిపోయాయి.

రోగులను రక్షించడమే సర్జన్ల లక్ష్యం


రక్తదానం చేస్తున్న రక్తదాతలు

- అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు తిరుమలప్రసాద్

విజయనగరం ఫోర్ట్: రోగులను రక్షించడం కోసం సర్జన్లు పరితపిస్తారని, ఈ క్రమంలో ఎంతో మంది సర్జన్లు తమ జీవితాన్ని అంకితం చేశారని అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కె. తిరుమల ప్రసాద్ అన్నారు. అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా డే సందర్భంగా రోటరీ, విజయ బ్లడ్ బ్యాంక్‌ల్లో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సర్జికల్ అసోసియేషన్ ప్రపంచంలోని అతి పెద్ద అసోసియేషన్‌గా పేర్కొన్నారు. రోగుల ప్రాణాలు కాపాడే సమష్టి ప్రయత్నంలో సర్జన్లు భాగస్వాములని చెప్పారు. సర్జన్లందరూ సమాజంలో ఆదర్శంగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి డాక్టర్ ఎ.రమణి, కోశాధికారి ఎ.గోపినాథ్, తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన వన్‌ధన్ కేంద్రాలు..


సీతంపేటలో మూసివేసి ఉన్న జీడి ప్రాసెసింగ్ యూనిట్

- తెరుచుకుకోని జీడి, చింతపండు ప్రాసెసింగ్ యూనిట్లు
- దళారీ వ్యాపారులు రంగప్రవేశం
- అధికారుల పర్యవేక్షణ అంతంతమాత్రమే ..


వీడీవీకే జీడి ప్రాసెసింగ్ కేంద్రంలో యంత్రాలు


చింతపండు, కొండచీపుర్ల యూనిట్ల దుస్థితి

సీతంపేట: మన్యం ప్రాంతంలో ఏర్పాటు చేసిన వీడీవీకేలు (వన్‌ధన్ వికాస్ కేంద్రాలు) నిదరోతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండు, మూడు తప్ప మిగతావన్నీ పడకేశాయి. వెలుగు ఆధ్వర్యంలో వివిధ రకాల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసినా చెప్పుకోదగ్గ పనితీరు కనబరచడం లేదు. దీంతో గిరిజనోత్పత్తులకు సరైన మార్కెటింగ్ లేక తప్పనిసరి పరిస్థితుల్లో దళారీలను ఆశ్రయించక తప్పడం లేదు. గిరిజనుల ప్రధాన ఆదాయ వనరులైన చింతపండు, జీడి పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి, తద్వారా గిరిజనుల జీవనోపాధులు మెరుగుపర్చాలనేది ఐటీడీఏ ఆశయం. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ క్షేత్రస్థాయి పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. సీజన్‌లో చింతపండు కొనుగోలు చేసి ప్రాసెస్ చేసి ప్యాకెట్ల రూపంలో తయారు చేసి వసతిగృహాలు, ఇతర మార్కెటింగ్ కేంద్రాలకు విక్రయించాలని గతంలో నిర్ణయించారు. వీటికి సంబంధించిన యంత్రాలను కూడా కొనుగోలు చేశారు. భవనాలు నిర్మించి సంబంధిత యంత్రాలను ఏర్పాటు చేశారు. ఐటీడీఏకు కూతవేటు దూరంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ప్రస్తుతం మూతపడి ఉంది.

జీడి ప్రాసెసింగ్‌దీ అదేదారి..

సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఏడు జీడి ప్రాసెసింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రంలో 300 మంది సభ్యులకు భాగస్వామ్యం కల్పించారు. జీడి పిక్కలు కొనుగోలు చేసి పప్పు తయారు చేసి మార్కెటింగ్ చేసి, వచ్చిన ఆదాయాన్ని అందరూ పంచుకోవాలి. ఇందుకు అవసరమైన యంత్రాలను సైతం రూ. 15 లక్షలు వెచ్చించి కొనుగోలు చేశారు. ఇలా ఏడు యూనిట్లకు కోటి రూపాయల వరకు ఖర్చు చేశారు. ఇందులో రెండు, మూడు తప్ప మిగిలిన కేంద్రాలు పనిచేస్తున్న దాఖలాలు లేవు. గతంలో శంభాంలో కూడా ఈ తరహాలోనే ప్రాసెసింగ్ కేంద్రాన్ని నెలకొల్పి కొంతకాలం నడిపారు. మహిళా సంఘాలుప్రాసెస్ చేసి జీడిపిక్కలు తీసినప్పటికీ సరైన మార్కెట్ లేకపోవడంతో నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. దీంతో కేంద్రం మూతపడింది. సరైన పర్యవేక్షణ లేకపోవడంతోనే మార్కెటింగ్ కేంద్రాలు మూసివేశారు. ఐటీడీఏ ప్రాంగణంలో ఈ సంవత్సరం వీడీవీకే ఆధ్వర్యంలో చింతపండు ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసినా ఇంతవరకు తెరుచుకోకపోవడం గమనార్హం. చింతపండు సీజన్ ఇక ముగిసిపోతుంది. కొండచీపుర్ల యూనిట్‌దీ అదే పరిస్థితి.

బాగానే నడుస్తున్నాయి...

సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఏడు జీడి ప్రాసెసింగ్ యూనిట్లు బాగానే నడుస్తున్నాయి. యూనిట్ల ద్వారా వీడీవీకేలకు ఉపాధి కల్పించడం జరుగుతుంది. చింతపండు, కొండచీపుర్ల యూనిట్లు పనిచేస్తున్నాయి.
– సన్యాసిరావు, వెలుగు ఏపీడీ, సీతంపేట ఐటీడీఏ

వీడీవీకేలను అలాగే వదిలేశారు



వీడీవీకేల ద్వారా నడుస్తున్న యూనిట్లను అలాగే వదిలేశారు. ఎటువంటి పనితీరు లేదు. ఇప్పటికైనా తగిన ప్రోత్సాహమివ్వాలి. ఈ సీజన్‌లో జీడి యూనిట్లు సక్రమంగా పనిచేసే విధంగా చూడాలి. ఐటీడీఏ పరంగా జీడి పిక్కలు కొనుగోలు చేయాలి.
– ఎస్.రామకృష్ణ, ముత్యాలు, ఎఫ్‌పీఓ మెంబర్

అప్పుడప్పుడు తెరుస్తారు..

రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులు, మంత్రులు, ఇతర ముఖ్యమైన వారు వచ్చినప్పుడు మాత్రమే జీడి ప్రాసెసింగ్ కేంద్రాలు నడిపిస్తున్నామంటూ తెరుస్తారు. వారు వెళ్లిన తర్వాత మళ్లీ మూసివేస్తారని పలువురు గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఏజెన్సీలో చింతపంట సుమారు 5 వేల హెక్టార్లలో పండగా, జీడి మరో 20 హెక్టార్లలో పండుతుంది. ప్రాసెసింగ్ యూనిట్లు మూతపడడం, మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు తప్పనిసరి పరిస్థితుల్లో దళారీలను ఆశ్రయించక తప్పడం లేదు. ప్రస్తుతం కిలో జీడి పిక్కలు 105 రూపాయలకు దళారీలు కొనుగోలు చేస్తున్నారు.